ఎట్టకేలకు మోక్షం..!

మూతపడిన కోహీర్ ఆర్టీసీ బస్టాండ్‌లో పునరుద్ధరణ పనులు

- జేసీబీతో పిచ్చిమొక్కల తొలగింపు
- త్వరలో బస్సులు అందుబాటులోకి వస్తాయని డీఎం వెల్లడి



కోహీర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జేసీబీ సహాయంతో తొలగిస్తున్న ముళ్ల పొదలు

జహీరాబాద్: గత దశాబ్ద కాలంగా మూతపడిన కోహీర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. కొంతకాలంగా బస్టాండ్ మూతపడడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ నేపథ్యంలో బుధవారం జహీరాబాద్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ స్వామి కోహీర్ బస్టాండ్‌ను సందర్శించారు. అనంతరం జేసీబీ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. అలాగే భవనం సైతం పూర్తిగా శిథిలం కావడంతో ప్రయాణికులు కూర్చునేందుకు వీలు లేకుండా మారింది. దీంతో ప్రయానికులు బస్టాండ్‌లోకి రావడం లేదు. రోడ్డుపైనే నిల్చుని బస్సులు, ఆటోల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, జహీరాబాద్ పట్టణం మున్సిపాలిటీగా ఏర్పడడంతో నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు బస్టాండ్ పునరుద్ధరణకు నడుం బిగించారు. ఇందులో భాగంగానే బస్టాండ్‌లోని ముళ్ల పొదలు, చెత్తను తొలగించే పనులు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ స్వామి మాట్లాడుతూ కొంతకాలంగా బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదని, ఇక నుంచి బస్టాండ్‌లోకి రాకపోకలను పునరుద్ధరిస్తామన్నారు. అలాగే బస్టాండ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని, ప్రయాణికులు ఎక్కేందుకు బస్టాండ్‌లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో సేఫ్టీ వార్డెన్ శ్రీనివాస్, సిబ్బంది నరేష్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

లోకల్ బస్సులు నడపాలని డిమాండ్

కోహీర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి జహీరాబాద్‌కు ప్రతి గంటకు లోకల్ బస్ ట్రిప్పులను నడపాలని ప్రజలు కోరుతున్నారు. లోకల్ బస్సులు అందుబాటులోకి వస్తే సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. బస్సులు సరిపడా లేక ఆటోల్లో ఇరుక్కుని కూర్చుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా బస్సుల సమయ సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మౌలిక వసతుల సమగ్రాభివృద్ధికి కృషి

ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మౌలిక వసతుల సమగ్రాభివృద్ధిలో భాగంగా ప్రతీ ఇంటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో తమ వంతు కృషి చేస్తున్నామని ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన తాగునీటి రిజర్వాయర్, సంపును ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ ద్వారా సుమారు 50పైగా కాలనీలోని ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు అందుతుందన్నారు. మహానగరంగా విస్తరిస్తున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీశైలం, వివిధ పార్టీల నాయకులు శ్యాంరావు, నర్సింహ, శ్రీపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమేశ్, నరేందర్‌రెడ్డి, నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీటి సరఫరా

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు ఎంపీఈఓ యూసుఫ్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని సరఫరా జరిగే మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలిపోవడంతో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

నీటి సరఫరా అస్తవ్యస్తం

నారాయణఖేడ్: పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో పట్టణ వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, సతీష్ దేశ్‌ముఖ్‌లు పేర్కొన్నారు. పట్టణ శివార్‌లోని మంచినీటి సంప్ వద్ద మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఖేడ్ పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు ఉండకుండా పెద్దారెడ్డిపేట్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయించారన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారంలో గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని సైకాలజీ విభాగం ఆత్మహత్యల నివారణ, అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ మేరకు ఆత్మహత్యపై దృక్పథాన్ని మార్చడంపై వాల్‌పోస్టర్ రూపకల్పన, నినాదాల తయారీ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆత్మహత్యల నివారణపై డాక్టర్ కుస్మున్ ఆతిథ్య అవగాహన కల్పించారు.

అవగాహన సదస్సు

జిన్నారం (పటాన్‌చెరు): మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించి వెంటనే నిపుణుల సలహా తీసుకోవాలని సైక్రియాటిస్ట్ డాక్టర్ మధు మోహన్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్య వైజ్ఞానిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని వినతి

జహీరాబాద్ టౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు బుధవారం ఆర్డీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ.. 2024–25 ఏడాదికి రూ. 8,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు గోపాల్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

నారాయణఖేడ్: కల్హేర్ మండలంలోని మాసానిపల్లికి చెందిన దామోదర్‌రెడ్డికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. అయితే ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచనమేరకు ఆయన సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా సంబంధిత చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఎరువుల దుకాణం ఎదుట బుధవారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ధారించిన ధర కంటే అధిక ధరలకు విక్రయించడమే కాకుండా యూరియా బస్తాలతోపాటు గులికలు, ఇతర క్రిమి సంహారక మందులు కొనుగోలు చేయాలని చెబుతున్నారని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి ఆసియా బేగంను విలేకర్లు ప్రశ్నించగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుచికరమైన భోజనం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



విద్యార్థులతో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. బుధవారం పట్టణంలోని భరోసా బాల సదన్, సఖీ కేంద్రాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రతతోపాటు ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతుల వివరాలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే హాస్టల్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు స్ఫూర్తి

ఐలమ్మకు ఘన నివాళి

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ ఒక మహోన్నతమైన స్థానాన్ని సంపాదించారని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఈ మేరకు ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా జిల్లాతోపాటు పలు కార్యాలయాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. ఆమె ప్రజా పోరాటాలకు స్ఫూర్తి అన్నారు. ఐలమ్మ వీరత్వాన్ని ప్రతి ఒకరూ ఉద్యమ స్ఫూర్తిగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.



సంగారెడ్డి: ఐలమ్మ చిత్ర పటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్ పర్సన్, తదితరులు

ప్రమాదకర భవనాలు తొలగించాలి: కలెక్టర్

సంగారెడ్డి జోన్: జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలతోపాటు పాఠశాల భవనాలను తొలగించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. భవనాలను తనిఖీ చేసి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా భవనాలు ప్రమాదకరంగా ఉంటే వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. భవనం మరమ్మతులతోపాటు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉత్తమ బోధనతోనే గుర్తింపు

హత్నూర(సంగారెడ్డి): విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు వస్తుందని ఎంఈఓ వెంకట నరసింహ గౌడ్ అన్నారు. బుధవారం హత్నూర రైతు వేదికలో మండలంలోని 32 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ ఘనంగా సన్మానించారు.

సన్మానం..

సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయుడు దయానంద్‌ను బుధవారం 1993–84 పూర్వవిద్యార్థులు సన్మానించారు. పూర్వ విద్యార్థుల మిత్రబృందం అధ్యక్షుడు శివయ్య, ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ పాల్గొన్నారు,

త్వరలో డబుల్ మంజూరు

నారాయణఖేడ్: మండలంలోని ఖేడ్-కంగ్టి రోడ్డును అనుసంధానిస్తూ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద త్వరలో డబుల్ లైన్ రోడ్డు మంజూరు కానుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ, ఖేడ్ మండల అధ్యక్షుడు దశరథ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక మూడుగుంటల చౌరస్తా నుంచి సంజీవన్‌రావుపేట, సిర్గాపూర్‌ల మీదుగా చాప్టా(కె) సమీపంలో పార్టీ నాయకులతో కలిసి బుధవారం రోడ్డును పరిశీలించారు. రోడ్డును మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప ద్వారా కేంద్రమంత్రి బండిసంజయ్‌కు వినతిపత్రం అందజేశారన్నారు. నాయకులు విఠల్, పట్నం మాణిక్, కనికేందర్, నవీన్, జ్ఞానేశ్వర్, భూంరాజ్, విష్ణు, యాదాగౌడ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



సదాశివపేటలో..

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

పుల్‌కల్(అందోల్): హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21 తేదీలలో 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ, ఎస్ఐ విశ్వజన్‌తో కలిసి నిర్వాహకులు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్ల సంఘం నాయకులు నందికంది శ్రీనివాస్, వీరేశం,శివకుమార్, బాలు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): హైదరాబాద్‌లో ఈనెల 19 నుంచి 21వరకు నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి జయచింతన్ పిలుపునిచ్చారు. బుధవారం ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఫొటోగ్రాఫర్ల అసోషియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బిట్ల రాజు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, రాజు, నాగు, శ్రీనివాస్, సత్తిబాబు, నాగన్న, సంగన్న పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

హత్నూర(సంగారెడ్డి): ఈనెల 19న హైదరాబాద్‌లో జరిగే ఎక్స్‌పో ఐకానిక్ ఈవెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బంటు శివ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి గొంట్యాల రాందాస్, మండల కోశాధికారి బొర్ర రాజు, ఇన్‌చార్జీ వీరప్రతాప్, ఫొటో గ్రాఫర్ల సంఘం నాయకులు దశరథ, గణేష్, లక్ష్మణ్, ప్రవీణ్ గౌడ్, మాణిక్యం, మోహన్ బాబు, మల్లేశం, సమీరా దత్తా, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి.. లంబాడాలను తొలగించొద్దు



చిత్రపటం దహనం చేస్తున్న గిరిజనులు

నారాయణఖేడ్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించొద్దని మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్ కోరారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సుప్రీం కోర్టును ఆశ్రయించడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలో గిరిజన లంబాలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు చెప్పుల దండలు వేసి గాడిదలపై ఊరేగించారు. అనంతరం దిష్టిబొమ్మలను దహనం చేశారు. లంబాడాలను రాజ్యాంగ బద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చగా కాంగ్రెస్ నాయకులు కోర్టును ఆశ్రయించి జాబితాలోంచి తొలగించి తీవ్ర అన్యాయం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లంబాడాల పక్షాన పోరాడాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు, నాయకులు రవినాయక్, శంకర్‌నాయక్, రాజునాయక్, సర్దార్ నాయక్, సంతోష్ నాయక్, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సత్య సాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో సమాజ అభివృద్ధికి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న సత్య సాయి బాబా మందిరంలో గురు పూర్ణిమ పురస్కరించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు. నవంబర్‌లో జరగనున్న సత్య సాయిబాబా గురుపూర్ణిమ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గం నుంచి 30వేల మంది భక్తులు తరలి వెళ్తున్నారన్నారు. వీరికి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి సత్యసాయి బాబా చేసిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందాయని తెలిపారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రత్యేక నీటి ట్యాంకులు నిర్మించి మంచినీటిని అందించినట్లు గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో సత్య సాయిబాబా మందిరాలు నిర్మాణాలకు భూమిని సైతం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సత్యసాయి బాబా సేవాసమితి బాధ్యులు రామిరెడ్డి, వెంకటేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా తవ్వకాలు చేపడితే చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మొల్కన్‌పాడ్ శివారులో అక్రమంగా కొనసాగుతున్న ఎర్రరాయి తవ్వకాలపై మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారి శ్యామ్‌రావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ మేరకు రెండు ఎర్రరాయి కోత మిషన్లు, ఒక లారీని సీజ్ చేశారు. పట్టుకున్న లారీని, స్వాధీనం చేసుకున్న రెండు కోత మిషన్లను హద్నూర్‌లోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎర్రరాయి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రకటన

మక్కల లక్ష్మి భర్త లేటు మక్కల ఇద్దయ్య, వయసు సుమారు 60 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, ఇం.నం.6-116/33, అమీన్‌పూర్ (గ్రా & మం), సంగారెడ్డి జిల్లా వాసినైన నేను తెలియజేయునది ఏమనగా నా భర్త లేటు మక్కల ఇద్దయ్య 29-08-2024న మరణించారు. వారికి నేను మరియు నా కుమారుడు మక్కల వెంకటేష్ మాత్రమే న్యాయవారసులుగా ఉన్నాము. మేము తప్ప వారికి ఇతరులు ఎవ్వరూ న్యాయవారసులు లేరు. లీగల్ హైర్స్ / ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ కోసం ఈ ప్రకటన జారీ చేస్తున్నాను.

విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ



కిట్లతో విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రిన్స్ పైప్స్, మహిత ఎన్జీఓ సంస్థ విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శంకర్ హాజరయ్యారు మహిత ఎన్జీఓ సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ బాలచందర్ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్ షిప్ రూపంలో బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, మహిత సంస్థ సభ్యులు సదానందంరెడ్డి, ప్రణీత, అనూష, రాజు, సత్యప్రకాష్, టీచర్స్, సీఆర్పీ రాజేశ్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ 33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ ఫోర్స్ అకాడమీ 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రకృతి నివాస్ ఉదయం 9: 30 నుంచి మధ్యాహ్నం 11:30 వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ మేరకు బొంతపల్లి దోమడుగు జిన్నారం ఇండస్ట్రియల్ ఫీడర్లపై అన్నారం, దోమడుగు, వీరభద్ర నగర్ పరిధిలో విద్యుత్ అంతరాయానికి గృహ వినియోదారులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు. బొంతపల్లి జిన్నారం ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆ దివంగత నేతల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

జిన్నారం (పటాన్‌చెరు): స్థానిక మండలాభివృద్ధికి విశేష కృషి చేసిన దివంగత నాయకులు మాజీ ఎమ్మెల్యే చిలుముల విట్టల్ రెడ్డి విగ్రహంతో పాటు మండల మాజీ ప్రజా పరిషత్ అధ్యక్షుడు పడకంటి వెంకటేశం గుప్తా విగ్రహాల ఏర్పాటుకు గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు నేతల ఏర్పాటును స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు సంయుక్తంగా భూమి పూజ చేశారు.

◆ జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 9 మందికి పట్టుకున్నట్లు చెప్పారు. వీరిని బుధవారం జిల్లా కోర్టులో హాజరు పర్చగా.. 8 మందికి రూ.1000, మరో వ్యక్తికి రూ.2 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

◆ జీపీఓలుగా నియామకం

నారాయణఖేడ్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వార్డు అధికారులుగా పనిచేస్తున్న తొమ్మిది మంది జీపీఓలుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, పారిశుద్ధ్య అధికారి శ్రీనివాస్ శాలువాలతో సన్మానించారు. జీపీఓలుగా మంచిసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

◆ భవనాల నాణ్యత పరిశీలించాలి

నారాయణఖేడ్: మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల భవనం కూలిన ఘటన అందరినీ కలిచివేసింది. అయితే ప్రభుత్వం స్పందించి జిల్లాలోని గురుకులాలు, వసతి గృహాలు, పాఠశాల భవనాల నాణ్యతను వెంటనే పరిశీలించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, కొలారి నర్సింలు, సహాయ కార్యదర్శి గణపతి, ఖేడ్ నియోజకవర్గ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కాన్షీరామ్ మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో శిథిల భవనాల గోడలు కూలే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లింగంపల్లి ఘటన నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో మరెక్కడా జరగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

◆ దాతలు సహకరించాలి

సంగారెడ్డి టౌన్: ప్రతి డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ఉచితంగా బస్సులు నడిపించేందుకు యాత్ర దానం టూర్ ప్యాకేజీతో బస్సులు నడిపిస్తామని ఆర్టీసీ ఆర్ఎం విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులకు, అనాథలకు బహుమతి రూపంలో ప్రయాణం ఉచితంగా అందజేస్తామని, ఈ మేరకు ఎన్ఆర్ఐలు, ఎన్జీఓలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. బస్సు యాత్ర దానం ఒక కొత్త సామాజిక సేవ, ఆధ్యాత్మికతకు సంబంధించిందని, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

◆ అక్టోబర్ 14న బహిరంగ సభ

జోగిపేట(అందోల్): అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించిన రోజు సందర్భంగా అక్టోబర్ 14న పట్టణంలో అంబేద్కర్ వాదంపై బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సమన్వయ కమిటీ సభ్యుడు పొట్టిగల్ల మొగులయ్య, సంటెన్నోళ్ల సంజీవయ్య, ఆందోల్ మల్లేశంలు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి, కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రసాద్, దాసరి దుర్గయ్య, పోచయ్య, బుజంగ రావ్, దీనా భాందవ్, తలారి కృష్ణ, హన్మంతు, సురేష్, తాడ్మన్నూర్ మాజీ ఎంపీటీసీ నర్సింలు పాల్గొన్నారు.

◆ దర్గాకు చాదర్ సమర్పించిన సెట్విన్ చైర్మన్

జహీరాబాద్: మండలంలోని శేఖాపూర్‌లో జరుగుతున్న హజ్రత్ షేక్ షాబుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి .ఉజ్వల్‌రెడ్డిలు చాదర్ సమర్పించారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్సవాలను హాజరై చాదర్ సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, జమీల్, ఇమాం , మొయిజొద్దీన్ పాల్గొన్నారు.

◆ సమయ పాలన పాటించాలి

రాయికోడ్(అందోల్): విధిగా సమయ పాలన పాటించాలని తహసీల్దార్ ఆశాజ్యోతి నూతనంగా విచ్చేసిన జీపీఓలను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ క్లస్టర్లకు నియమించిన జీపీఓలు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. తహసీల్దార్ ఆశాజ్యోతి, డీటీ నరేష్‌లు జీపీఓలతో సమావేశం ఏర్పాటు చేసి విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, జీపీఓలు కృష్ణ, మల్లన్న, జైపాల్, రాణి, తదితరులు ఉన్నారు.

◆ పెండింగ్ వేతనాలపై నిరసన

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టర్ కార్మికులు బుధవారం విధులు బహిష్కరించి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు.

◆ భక్తుల కిటకిట

పటాన్‌చెరు టౌన్: గణేష్ గడ్డ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారంలోని గణేష్ గడ్డ దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్ధివినాయకుడి సన్నిధిలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

◆ షాహబొద్దీన్ దర్గా సందర్శన

జహీరాబాద్ టౌన్: మజ్లిస్ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్ మండలంలోని షేకాపూర్‌లో ఉన్న షేక్ షహబొద్దీన్ దర్గాను బుధవారం సందర్శించారు. ఈ మేరకు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. ఆయన వెంట ఎంఐఎం జహీరాబాద్ అధ్యక్షుడు అక్తర్ అహ్మద్, నాయకులు యామీన్‌ఖాన్, మోహినోద్దీన్ ఘోరీ, మాజీద్ తదితరులు పాల్గొన్నారు.